## కూటికోసం చిందులు

చిందుకళకు ఆదరణ తగ్గింది. దీంతో కళాకారులు పొట్టకూటి కోసం వీధుల వెంట తిరగాల్సిన పరిస్థితి నెలకొన్నది. నిజామాబాద్ నగరంలోని వీధుల్లో కళాకారులు ఇలా తిరగడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



## సావిత్రీబాయికి ఘన నివాళి

తొలి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలేకు ఉమ్మడి జిల్లా ప్రజలు ఘన నివాళులర్పించారు. బుధవారం ఆమె జయంతి సందర్భంగా విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, పూలే సేవలను కొనియాడారు.



టీయూలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

# నిజాంషుగర్స్‌ను తెరిచేనా..

## మాటలకే పరిమితమా!

ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్

చెరుకు రైతులు ముందుకువస్తే తెరిపిస్తామన్న స్థానిక ఎమ్మెల్యే

లేఆఫ్‌లో కర్మాగారం.. సాంకేతిక అంశాలపై కానరాని అధ్యయనం

'పునరుద్ధరణ' కార్యాచరణపై స్పష్టత కరువు

**ఇటీవల** జరిగిన ఎన్నికల్లో ఓట్ల కోసం నిజాంషుగర్స్‌ను తెరిపిస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తొలి సారిగా బోధన్ నియోజకవర్గానికి వచ్చిన సుదర్శన్‌రెడ్డి.. నిజాం షుగర్స్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. 'రైతులు చెరుకు పండించేందుకు ముందుకువస్తే.. నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామంటూ ప్రకటన చేశారు. అలాగే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనే కాకుండా 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తాము అధికారంలోకి వస్తే నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇటీవల ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా కాంగ్రెస్ నేతలు నిజాం షుగర్స్ పునరుద్ధరణ విషయాన్ని ప్రస్తావించారు. దీంతో నిజంగానే ఈ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తారా.. లేదంటే మాటలకే పరిమితమవుతారా.. అన్న విషయమై ప్రజలు చర్చించుకుంటున్నారు


*నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ఉమ్మడి రాష్ట్రంలో ఒక వైభవాన్ని చూసి, టీడీపీ హయాంలో జాయింట్ వెంచర్ పేరిట ప్రైవేట్ కంపెనీ చేతుల్లోకి వెళ్లింది. అనంతరం లేఆఫ్‌కు గురై మూతపడిన ఈ ఫ్యాక్టరీని తెరిపిస్తామంటూ కాంగ్రెస్ నాయకులు పదేపదే చెబుతుండడం సర్వత్రా చర్చకు దారితీసింది.*

*–బోధన్, జనవరి 3*



### సాంకేతిక అడ్డంకులపై స్పష్టత ఏదీ?

సుప్రీంకోర్టులో ప్రైవేట్ కంపెనీ దావా వేసిన విషయాన్ని ప్రస్తుత కాంగ్రెస్ నాయకులు పరిగణనలోకి తీసుకున్నారా...? ఇప్పుడైతే నిజాం షుగర్స్ పరిధిలో చెరుకు సాగు లేదు.. చెరకు పండించేందుకు ఉన్న అడ్డంకులను తొలగించే చర్యల గురించి ఆలోచించారా.? ప్రైవేట్ కంపెనీతో ఉన్న చిక్కుముడుల్ని ఏ విధంగా ఇవ్వగలుగుతారు.. అన్న ప్రశ్నలను కర్షకులు, కార్మికులు వేస్తున్నారు.. వీటిపై ఎటువంటి కసరత్తు లేకుండా నోటిమాటగా నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని కాంగ్రెస్ పాలకులు చెబుతున్నారా.. లేదా నిజాం షుగర్స్ పునరుద్ధరణ కోసం వారి వద్ద స్పష్టమైన కార్యాచరణ ఏదైనా ఉందా.. అన్న విషయమై స్పష్టత లేదు.. 2002లో చంద్రబాబు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయగా, 2004లో అధికారంలోకి వచ్చిన వైస్ రాజశేఖర్‌రెడ్డి నిజాం షుగర్స్ ప్రైవేటీకరణపై సభాసంఘం వేశారు. ఆ సభాసంఘంలో ప్రస్తుతం బోధన్ ఎమ్మెల్యేగా ఉన్న సుదర్శన్‌రెడ్డి సభ్యుడు. ఆ సభాసంఘం నిజాంషుగర్స్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిఫార్సు చేసినప్పటికీ, ఆ సిఫార్సును నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేయలేదు. అప్పటిలాగానే ఇప్పుడు కూడా 'నిజాం షుగర్స్‌ను తెరిపిస్తాం' అన్న హామీ మాటలకే పరిమితమవుతుందా.. లేదా నిజమవుతుందా అన్న విషయం తెలియాలంటే వేచిచూడక తప్పదు.



**నాటి పాలకుల నిర్లక్ష్యం.. నష్టాల్లో కర్మాగారం**

1938లో నిజాంపాలనలో బోధన్‌లో ప్రారంభమైన నిజాంషుగర్స్ అంచెలంచెలుగా అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో విస్తరించింది. నిజాం షుగర్స్ విషయంలో నాటి పాలకుల నిర్లక్ష్యం కారణంగా క్రమంగా ఆ ఫ్యాక్టరీ నష్టాల వైపుగా ప్రయాణం చేసింది. నష్టాలను నివారించి ఆ సంస్థను లాభాల బాటలోకి ఎక్కించాల్సిన బాధ్యతను విస్మరించిన చంద్రబాబునాయుడు తాను సీఎంగా ఉన్న కాలంలో.. 2002లో జాయింట్ వెంచర్ పేరిట డెల్టా కంపెనీకి అప్పగించారు. జాయింట్ వెంచర్ 51 శాతం వాటా ప్రైవేట్ కంపెనీకి, 49 శాతం వాటా ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, నిజాం షుగర్స్‌పై ప్రైవేట్ కంపెనీకే పెత్తనమంతా దక్కింది. నిజాం షుగర్స్ లిమిటెడ్ కంపెనీ కాస్త.. నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌గా మారింది. కొన్నేండ్ల పాటు ఫ్యాక్టరీని నడిపిన ప్రైవేట్ యాజమాన్యం 2015 డిసెంబర్ 23న లేఆఫ్ ప్రకటించింది. దీంతో అప్పటికి నిజాంషుగర్స్ యూనిట్లుగా ఉన్న శక్కర్‌నగర్ (బోధన్), మెట్‌పల్లి, మెదక్ యూనిట్లు మూతపడ్డాయి. లేఆఫ్ కింద నిజాం షుగర్స్ మూతపడి డిసెంబర్ 23 నాటికి 9 సంవత్సరాలు పూర్తయ్యింది.

### న్యాయపోరాటం చేసిన కేసీఆర్ ప్రభుత్వం

నిజాం దక్కన్ షుగర్స్ యాజమాన్యం తన వివిధ ఆర్థిక సంస్థలు, బ్యాంకుల్లో అప్పులు ఉన్నాయని, వీటిని పరిష్కరించాలని 2016లో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్ (ఎన్‌సీఎల్‌టీ)లో ఇన్‌సాల్వేన్సి పిటిషన్‌ను దాఖలుచేసింది. ఎన్‌సీఎల్‌టీ ప్రైవేట్ యాజమాన్యానికి అనుగుణంగా తీర్పు రావడంతో కేసీఆర్ నాయకత్వంలోని నాటి కేసీఆర్ ప్రభుత్వం స్పందించింది. నిజాం షుగర్స్ భూములు, ఆస్తులను రక్షించాలన్న తపనతో ఢిల్లీలోని ఎన్‌సీఎల్‌ఏటీ (నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యూనల్)కు కేసీఆర్ ప్రభుత్వం వెళ్లింది. ప్రైవేట్ యాజమాన్యం నిజాం షుగర్స్ లాభాలను అనుభవించిందని, తెలంగాణాలోని విలువైన నిజాం షుగర్స్ భూములను తాను చేసిన అప్పుల కింద అమ్మివేయించేందుకు కుట్ర చేస్తోందని అప్పిలేట్ ట్రిబ్యూనల్‌లో వాదించింది. దీంతో నిజాం షుగర్స్ లిక్విడేషన్ తీర్పుపై కేసీఆర్ ప్రభుత్వానికి అనుగుణంగా అప్పిలేట్ ట్రిబ్యూనల్ 2019లో తీర్పు ఇచ్చింది. అయితే, ప్రైవేట్ యాజమాన్యం దీన్ని సవాల్‌చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఈ వివాదం ఉంది. ఇదంతా నిజాం షుగర్స్ పునరుద్ధరణ ప్రక్రియకు సాంకేతిక అడ్డంకిగా మారింది.

## ఆర్మూర్ బల్దియాలో నేడు బలపరీక్ష



ఆర్మూర్‌టౌన్, జనవరి 3: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై పలువురు కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై గురువారం బలపరీక్ష జరగనున్నది. ఆ మేరకు అధికారులు సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో ఇరువర్గాల నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ల మద్దతును కూడగడుతూ క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. ఆర్మూర్ మున్సిపాలిటీలో మొత్తం 36మంది కౌన్సిలర్లు ఉండగా, బీఆర్‌ఎస్‌కు 30, బీజేపీ 5, ఎంఐఎం 1 కౌన్సిలర్లు ఉన్నారు. సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లే మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడంతో గురువారం నిర్వహించనున్న బలపరీక్ష సమావేశంపై ఉత్కంఠ నెలకొన్నది.

### వీగిపోయిన అవిశ్వాస తీర్మానం

రాజంపేట్, జనవరి 3, రాజంపేట సొసైటీ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ రమేశ్‌పై ఇటీవల కొందరు డైరెక్టర్లు అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదించారు. ఈ మేరకు బలపరీక్ష కోసం బుధవారం సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. నిర్ణీత సమయానికి సభ్యులు హాజరుకాలేదు. కోరం లేని కారణంగా అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి భూమయ్య ప్రకటించారు.

## రేపు జాబ్‌మేళా..

నిజామాబాద్ స్పోర్ట్స్, జనవరి 3: జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సిరిమల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగులు ఉద్యోగ మేళాలో పాల్గొనాలని సూచించారు. అభ్యర్థులు శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు రావాలని తెలిపారు. వివరాలకు 9581768413, 9948748428, 9959456793 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

**6న కామారెడ్డిలో..**

కామారెడ్డి, జనవరి 3 : కామారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తులోని రూం నంబర్ 121లోని జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏండ్ల యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9573973688, 9848237987, 7671974009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## అయ్యప్ప భక్తుల ఆటోను ఢీకొట్టిన లారీ

అక్కడికక్కడే ఒకరు మృతి

మరో ముగ్గురు మాలధారులకు తీవ్రగాయాలు

పడిపూజకు వెళ్లి వస్తుండగా నిజాంసాగర్ వద్ద ప్రమాదం



ప్రమాదానికి గురైన ఆటో

నిజాంసాగర్, జనవరి 3: పడిపూజకు వెళ్లి వస్తున్న అయ్యప్ప మాలధారుల ఆటోను ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరో ముగ్గురు భక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మాసన్‌పల్లి గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు సాయిలు, బాలకృష్ణ అంజయ్య, విఠల్, లింగం, యంబరి కాశయ్య (55) బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని మల్కాపూర్‌లో నిర్వహించిన పడిపూజకు ఆటోలో వెళ్లారు. పూజ అనంతరం స్వగ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో మాగి చక్కెర ఫ్యాక్టరీలో చెరుకును అన్‌లోడ్ చేసి వస్తున్న ఓ లారీ నిజాంసాగర్ మండల కేంద్రంలోని చర్చి వద్ద ఆటోను ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యంబరి కాశయ్య అక్కడికక్కడే మృతి చెందగా, లింగం, బాలకృష్ణ అంజయ్య, విఠల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం మరో ఆటోలో ఎల్లారెడ్డి దవాఖానకు తరలించారు. డ్రైవర్ సాయిలుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే వాహనాన్ని వదిలేసి లారీ డ్రైవర్ పారిపోయాడు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాజశేఖర్ పరిశీలించి వివరాలు సేకరించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

### అనుమానాస్పదంగా యువతి మృతి

జక్రాన్‌పల్లి, జనవరి 3: జక్రాన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కలిగోట్ గ్రామానికి చెందిన దుబ్బాల ప్రియాంక(22) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకొని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తమ కూతురు మృతిపై అనుమానం ఉన్నదని తల్లిదండ్రులు దుబ్బాల సుజాత–గంగాధర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ధర్మారం(బీ) విద్యార్థులు

ఇందల్వాయి, జనవరి 3: స్కూల్ గేమ్స్ అండర్–19 హ్యాండ్ బాల్ పోటీలకు ధర్మారం(బీ) పాఠశాలకు చెందిన విద్యార్థినులు డి.నవనీత, బి.వర్ష ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికయ్యారన్నారు. హర్యానాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో డి.నవనీత, బి.వర్ష పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను సోషల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ జిల్లా కోఆర్డినేటర్ నీరజారెడ్డి, పీఈటీ ఒసా, జ్యోత్స్న, హౌస్ టీచర్ నూర్నిష బుధవారం అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

## తెలుగు సాహితీ అర్చకుడు మల్లెగోడ



కేవీ రమణాచారితో గంగాప్రసాద్, పుస్తకావిష్కరణలో తదితర సాహితీవేత్తలు

జాతీయ కవిగా గుర్తింపు

ఆలిండియా కవి సమ్మేళనానికి ఆహ్వానం

అరుదైన గౌరవం దక్కించుకున్న గంగాప్రసాద్

నిజామాబాద్ కల్చరల్, జనవరి 3: ఆంగ్ల మాధ్యమ పాఠశాలల ప్రభావంతో మన మాతృభాష తెలుగు క్రమంగా అదృశ్యమైపోతున్నది. తెలుగు భాషాభిమానులు ఆందోళన చెందుతున్న తరుణంలో తెలుగు సాహితీ అర్చకుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్ ఇందూరు ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో ఈ నెల 5న నిర్వహించనున్న ఆకాశవాణి సర్వభాష జాతీయ కవిసమ్మేళనానికి ఎంపికయ్యారు. తన కవిత్వాన్ని చదవాలని ఆల్‌ఇండియా రేడియో కోరింది.

**అర్సపల్లి నుంచి పట్నం దాకా..**

నిజామాబాద్ నగర శివారులోని అర్సపల్లికి చెందిన సాయిలు–యశోద దంపతుల కుమారుడు గంగాప్రసాద్ ఐటీఐ పూర్తిచేశారు. అనంతరం ఒక మెకానిక్ దగ్గర పనిచేసి హైదరాబాద్ యూనివర్సిటీ దాకా వెళ్లాడు. పరిశోధనలో గోల్డ్‌మెడల్ అందుకోవడం వెనక గంగాప్రసాద్ దీక్ష, పట్టుదల ఎంతో ఉంది. డాక్టర్ మల్లెగోడ కృషి నేటి యువతరానికి స్ఫూర్తి.

**గెస్ట్ లెక్చరర్‌గా..**

తెలుగు భాషపై ఉన్న మమకారంతో జిల్లాకు చెందిన కవి, సాహితీవేత్త ఉపాధ్యాయుడు డాక్టర్ కాసర్ల నరేశ్ ప్రోత్సాహంతో గంగాప్రసాద్ ఎంఏ (తెలుగు) పూర్తి చేశాడు. ఏకంగా ఆరు పుస్తకాలను రాశారు. సాహిత్య అకాడమీ తరపున శాతవాహనుడు, కాకతీయులు, అసబ్‌జాహీల వరకు కేవలం ఐదు రోజుల్లోనే 400 పుటల పుస్తకాన్ని రూపొందించారు. కవిత్వం, కథ, విమర్శ, వ్యాసం, పాట, పరిశోధన ఇలా అన్ని రంగాల్లో తన సృజనాత్మకతతో అలవోకగా వ్యాసాలు రాయడంలో గంగాప్రసాద్‌ది అందెవేసిన చెయ్యి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆయన మొదటి ర్యాంకు సాధించి తెలుగుభాషలో గోల్డ్‌మెడల్ సాధించారు. తదనంతరం అక్కడే ఉద్యోగంలో చేరారు. జాతీయ సెమినార్లలో తన పుస్తకాలను ఆవిష్కరించారు. 'కవిత్రయ భారతం – కాలస్పృహ' అనే అంశం మీద పీహెచ్‌డీ పట్టా పొందారు. అదే క్రమంలో కాలదృక్పథం, కాల పదాల నిఘంటువును రూపొందించారు. గజేంద్ర మోక్షం వ్యక్తిత్వ వికాసం అనే అంశాలపై ఎంఫిల్ చేశారు. వందలాది సినిమా, జానపద పాటలు, వేలాది కవితలతో గంగాప్రసాద్ తెలుగు సాహిత్యానికి అక్షరాభిషేకం చేస్తున్నారు. దివంగత సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం మీద ప్రసాద్ రాసిన నివాళి గీతం ఎంతోమంది ప్రశంసలు పొందింది. పలు షార్ట్ ఫిల్మ్‌లకు మాటలు, పాటలు కూడా రాశారు.

### ఆనందంగా ఉంది



జాతీయ కవిగా ఆకాశవాణి సర్వభాష జాతీయ కవి సమ్మేళనానికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. తెలుగు భాష, మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి కృషి చేస్తున్నా. నేటి తరానికి మాతృభాషపై ఆసక్తి కలిగించడానికి త్వరలోనే తెలుగు భాషా నిఘంటువును రూపొందించాలని ఉంది. నాకు దక్కిన అరుదైన గౌరవాన్ని కవి గురువు కాసర్ల నరేశ్‌కు అంకితమిస్తున్నా.

**-డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్**

## పాఠశాలల సమస్యలను పరిష్కరిస్తాం



పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

**ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి**

నందిపేట్, జనవరి 3: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తీర్చేందుకు మొదటి ప్రాధాన్యమిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. నందిపేట్ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్, కస్తూర్బా పాఠశాలలను ఆయన బుధవారం పరిశీలించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటగది, మూత్రశాలలను పరిశీలించారు. నియోజకవర్గంలోని 173 ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని, ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నందిపేట్‌లోని వసతిగృహ స్థలాన్ని పరిశీలించారు. కోట్లాది రూపాయల విలువచేసే స్థలాన్ని వాడుకలోకి తీసుకురావాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను కోరామని, స్థలాన్ని శుభ్రం చేస్తే క్రీడా ప్రాంగణంగా ఉపయోగించుకుంటామన్నారు.

## నిరుపేదలను ఆదుకునేందుకు ఆరు గ్యారెంటీలు



గన్నారంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, జనవరి 3: నిరుపేదలను ఆదుకునేందుకు ఆరు గ్యారెంటీలను రూపొందించామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఇందల్వాయి మండలం గన్నారం, డిచ్‌పల్లి మండలంలోని దూస్‌గాం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మోసపూరిత కార్యక్రమాలకు పాల్పడిందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తగిన బుద్ధి చెబుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కుంట మోహన్‌రెడ్డి, శివారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నవీన్‌గౌడ్, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.